**కామెడీ కథ**

# ఉద్యోగం

''మా బ్రాంచిలోని ఉద్యోగస్తుల వివరాలన్నీ ఈ కాగితాల్లో రాసి వుంచాను..ప్రకాశం. వాళ్ళకున్న అవలక్షణాలన్నీ పోగొట్టాలని నేను శతవిధాల ప్రయత్నించి విఫలుడ్ని అయ్యాను.

ఇదంతా ఇలాగే కొనసాగితే, నేను మేనేజర్గా పనికిరానని నా ఉద్యోగం పీకేస్తారు. కాబట్టి. నువ్వు ఈ కాగితాలన్నీ చదివి, పరిష్కారం ఆలోచించి నాకు చెప్పావంటే... చచ్చి నీ కడుపున పుడతాన్రా ప్రకాశం'' - అన్న నరసింహం మాటలకు ప్రకాశం నవ్వి-

''నీకా ఛాన్సు... చచ్చినా యివ్వను. నేను వేసెక్టమీ చేయించుకున్నానురా'' అన్నాడు.

''విషయాన్ని కాస్త సీరియస్గా తీసుకోరా బాబూ! ఆ... ఇంకొక విషయం. ఈ సంగతి మూడో కంటివాడికి తెలీకూడదు సుమా!'' అన్నాడు నరసింహం మెల్లగా.

''నేను కైలాసం వెళ్ళను లేరా!'' ధైర్యం చెబుతున్నట్లుగా అన్నాడు ప్రకాశం.

''కైలాసం వెళ్ళటమేమిట్రా?!'' అర్థంకాక అడిగాడు నరసింహం.

''అదే... మూడోకంటివాడికి తెలీకూడదన్నావుకదా! శివుడు కైలాసంలోనే కదా వుండేది!'' చెప్పాడు ప్రకాశం.

''ఏడిపించకురా ప్రకాశం..!'' జాలిగా అన్నాడు నరసింహం. ''పేరుకేగానీ..నీ మనసు మాత్రం వెన్నపూసరా!'' అన్న ప్రకాశం మాటలకు నరసింహం కొద్దిగా ఊరట చెందాడు.

ఆ రాత్రే... నరసింహం-రాసిచ్చిన వాళ్ళ ఆఫీసు సిబ్బంది కాగితాలను తీసి పరిశీలించాడు ప్రకాశం.

1. అనంత రామయ్యగారు-సూపర్వైజర్. వయసు 57 సంవత్సరాలు. ఆయనకు 25 సంవత్సరాల సుదీర్ఘమైన అనుభవం ఉంది ఈ కంపెనీలో! అందరినీ పెద్దరికమైన చనువుతో పలకరిస్తారు. ఎక్కువ మాట్లాడే తత్త్వం. ఏ విషయం గురించి మాట్లాడినా, దానికి తన జీవితానుభవాల్ని జోడించి... ఎదుటివారి సహనాన్ని పరీక్షించిగాని వదలరు. ఆయన దెబ్బకు ఆఫీసులో అందరూ బలైన వారే.

2. నిరంజన్ కుమార్- రిప్రజెంటేటివ్. వారానికి మూడు రోజులు ఆఫీస్ డ్యూటీ. నాలుగు రోజులు బయట క్యాంపులు. ఐదు నిమిషాలకొకసారి పిచ్చి పిచ్చి కవితల్ని చాలా పిచ్చిగా, అనర్గళంగా చెప్పే అలవాటు. ఆయన కవితల్ని వింటూ వుంటే... అందరికీ కడుపులో తిప్పినట్లుగా వుంటూ వుంటుంది. కంపెనీలో రెండు సంవత్సరాల క్రితం చేరాడు.

3. సుజాత- టైపిస్ట్. 5 సంవత్సరాల సర్వీస్. చేరిన కొత్తల్లో హుషారుగా పనిచేసేది. గత రెండు సంవత్సరాలుగా ఏదో తెలియని వ్యాధితో బాధపడుతోంది. హుషారు తగ్గింది. వారంలో మూడు రోజులు వాంతులు అవుతుంటాయి. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఫలితం లేకపోయింది. ఉద్యోగం మానేస్తే గడవని పరిస్థితి.

4. రాంబాబు- అటెండర్. స్థాయి చిన్నదేకానీ, తలబిరుసు ఎక్కువ. చెప్పిన పనిని, చెప్పినట్లుగా చేసే రకం కాదు.

5. చివరగా నేను... అంటే నరసింహం..మేనేజర్. వీళ్ళందరి పైనా సామ, దాన, భేద, దండోపాయాలు అన్నీ ప్రయోగించినా ఏమీ చేయలేని, సాధించలేని వాడిని. ఉపాయాలు దొరక్క, అపాయంలో పడబోతున్న వాడిని. ఒరే..ప్రకాశం..నువు సైకాలజీ చదివిన వాడివిరా. ఈ సమస్యను నువ్వే పరిష్కరించాలి.''

చదవటం పూర్తి చేసి, ఆలోచనలో పడ్డాడు ప్రకాశం. పరిష్కారం దొరికింది. పథకం వేసాడు. దానిని మర్నాడు ఈ విధంగా అమలులో పెట్టాడు ప్రకాశం.''నీకు దొరికిన పరిష్కారం ఏంటో చెప్పరా ప్రకాశం!'' ఎదురుగా కూర్చున్న ప్రకాశాన్ని అడిగాడు నరసింహం.

''తొందర పడకురా..ముందుగా రాంబాబుని పిలు. పిలిచి రెండు జగ్గులతో మంచినీళ్ళు తెప్పించు'' అన్నాడు ప్రకాశం.

నరసింహం కాలింగ్ బెల్ కొట్టాడు. రాంబాబు రాగానే-''రెండు జగ్గులతో మంచినీళ్ల తెచ్చి పెట్టు'' అన్నాడు నరసింహం.

రాంబాబుకు అయోమయం అయింది. ''రెండు గ్లాసులతోనా? రెండు జగ్గులతోనా..సారూ!?'' అని అడిగాడు.

''రెండు జగ్గులతోనే..'' ప్రకాశం సమాధానమిచ్చాడు.

రాంబాబు, ప్రకాశం వంక వింతగా చూస్తూ బయటకు కదిలాడు. నరసింహానిది ప్రేక్షక పాత్ర అయింది.

రాంబాబు జగ్గులతో నీళ్ల తేగానే..ప్రకాశం వాటిని వాసన చూసి..''ఏమీ కలపలేదు కదా?'' అని అడిగాడు.

రాంబాబు బిత్తర చూపులు చూస్తూ - ''కలపటం ఏమిటి?'' అన్నాడు.

''ఏం లేదులే... వెళ్లు. వెళ్లి, కుమార్గారిని లోపలికి రమ్మను'' అన్నాడు ప్రకాశం.

రెండు నిమిషాలలో కుమార్ అని పిలువబడే నిరంజన్ కుమార్ వాళ్ళ ముందు వున్నాడు.

ప్రకాశం..తనని తాను..నరసింహం చిన్ననాటి స్నేహితునిగా పరిచయం చేసుకుని..

''మిస్టర్ కుమార్..నీకంటే వయసులో పెద్దవాడిని కనుక 'నిన్ను' అని ఏకవచనంలో సంభోదించవచ్చునా..'' అని అడిగాడు. కుమార్ మాట్లాడలేదు. మరల ప్రకాశమే మాట్లాడుతూ- ''నువ్వు కవితలు బాగా చెబుతావుట కదా! నేనూ ఈమధ్య కవితలు రాస్తున్నాను. విని..నీ అభిప్రాయం చెప్పు'' అంటూ ఆశువుగా కవిత చెప్పటం మొదలుపెట్టాడు- ప్రకాశం.

''నీ పేరు...కుమారు.
పూర్తి పేరు చెప్పు..ఇంకొకమారు.
చెబుతావా కవితలు నాకు..?
నేర్పవాకు బూతులు మాకు.''

కుమార్కి అర్థంకాక చూస్తూ నిలబడ్డాడు.

''ఆకలేస్తే అన్నం తింటావు
దాహం వేస్తే నీరు తాగుతావు
అంతేగా కుమారు..బీరుకొట్టు ఇంకొక మారు''

కుమార్ మెదడులో ఏదో కదులుతున్న అనుభూతి.

''సాలీడు గూడు కడుతుంది
గూటిలో పడ్డ కీటకాల్ని భక్షిస్తుంది
అంతేగాని..
సాలీడు మరొక సాలెగూడులో ఇరుక్కోదు.
ఇరుక్కున్నా ఇంకొక సాలీడుకు ఆహారం కాదు.''కళ్ళు తిరుగుతున్న ఫీలింగ్తో కుమార్ గట్టిగా టేబుల్ని పట్టుకుని నిలబడ్డాడు.

''ఏడ్చే పిల్లాడి చేతిలో బెల్లం ముక్క
అడవిలో తిరుగుతున్న గజ్జి నక్క



కుక్క
నోట్లో రొట్టె ముక్క
అయస్కాంతానికి అతుక్కున్న ఇనుపచెక్క''

ప్రక్కనే వున్న జగ్గుని ఎత్తి పట్టుకుని గటగటా నీళ్ళు తాగాడు కుమార్.

''ఈగలు ముసిరిన మాంసం
బొద్దింకల పాయసం
సున్నం కలిపిన అన్నం
చీమలు పట్టిన వంటకం''

కుమార్ కడుపులో తిప్పుతోంది. ఇంతలో రాంబాబు లోపలికి వచ్చాడు. మంచినీళ్ళ గ్లాసులతో.

''నీళ్ళల్లో గబ్బిలాయి
నిప్పుమీద కీచురాయి
ఓ సింహమా! గడ్డి మేయి
కుక్క
తోక తొక్కినా
నక్క వీపు ఎక్కినా...
మొట్టికాయ వేసినా-
కాలితో తన్నినా..

కుమార్..జగ్గులో మిగిలిన నీళ్ళన్నీ గడగడ తాగి..వెనక్కి విరుచుకు పడిపోయాడు.

ప్రకాశం కోపంగా..రాంబాబు వంక తిరిగి ''నీళ్ళల్లో ఏమీ కలపలేదన్నావ్! చూడు. ఆ నీళ్ల తాగే..ఆయన పడిపోయాడు'' అన్నాడు.

రాంబాబుకు నిలువుగుడ్లు పడ్డాయి. ''నీళ్లల్లో మందు కలపటం ఏంటండీ!?'' కుప్పకూలిపోయాడు.

''నిజంగా నాకేం తెలీదు సార్!'' ప్రకాశం కాళ్లు పట్టుకున్నాడు రాంబాబు.

''సర్లే..లే..లేచి వెళ్లి ఆ ఖాళీ జగ్గుతో మంచినీళ్లు తెచ్చి పెట్టి..కుమార్‌ని మెల్లగా లేపి, బయటకు తీసుకుపో'' గంభీరంగా చెప్పాడు ప్రకాశం.

యం.యస్.శాయిబాబు

నరసింహానికి అంతా అయోమయంగా ఉంది. చూస్తూ కూర్చున్నాడు.

కాస్సేపటికి సుజాతగారు లోపలికి పిలిపించబడ్డారు.

''ఏమ్మా-నీకు ఆ మూడురోజులే కదా..ఇబ్బంది?'' అడిగాడు ప్రకాశం.

ఎవరో క్రొత్త వ్యక్తి, అందునా తన బాస్ ముందు... అసందర్భంగా తనని అలా అడిగినందుకు సుజాత ముఖం ఎర్రగా చేసుకుని..తలవంచుకొని..

''అది ప్రతి స్త్రీకి..సహజమే కదండి!'' అంది.

అర్థం అయిన నరసింహం, ప్రకాశం ఉలిక్కిపడ్డారు. ప్రకాశం వెంటనే సర్దుకొని ..'' అబ్బే నా ఉద్దేశం అది కాదమ్మా..! సారీ..నీకు ఆరోగ్యానికి ఇబ్బంది కలిగించి వాంతులు అయ్యేది వారంలో మూడు రోజులే కదా..అని నా ఉద్దేశ్యం. అయినా ఈరోజు నుండి నీకు ఎటువంటి అనారోగ్యం

ఉండదు లేమ్మా'' అన్నాడు ప్రకాశం.

''ఏం సార్! మీరు డాక్టరా! ఏదయినా మంది స్తారా!?'' ఆసక్తిగా అడిగింది సుజాత.

''లేదమ్మా. అయినా రోగివి నువు కాదు. రోగానికి మాత్రం మందిచ్చానులే..'' అన్న ప్రకాశం మాటలు అర్థం కాక తెల్లమొహం వేసుకుని బయటకు వెళ్లిపోయింది సుజాత.

''ఆమేరా..రోగి..ఆమెకే వాంతులు అవుతుంటాయి'' అన్నాడు నరసింహం కంగారుగా.

''నిజమేరా..సింహం. కానీ..అసలు విషయం ఏమిటంటే..కుమార్ కవితల ప్రభావానికి ఆమె బాగా ఇబ్బంది పడుతోంది. ఆ కవితలు ఈమె వాంతులకు కారణం. నా కవిత దెబ్బతో నిరంజన్ కుమార్ త్వరగా కోలుకోడు. కోలుకున్నా కవితలు చెప్పడు. ఎందుకైనా మంచిది. కుమార్ బెడ్‌ని వేరే రూమ్‌లో వేయించు. ప్రక్కన ఎవ్వరూ ఉండకూడదు మరి..'' అని చెప్పి ''ఇతనే ఆఫీసు స్టాఫ్‌లోకెల్లా ప్రమాదకారి..ఇతని వల్ల ముందు, ముందు అందరికీ మతులు పోతాయి. జాగ్రత్త..'' అన్నాడు ప్రకాశం.నరసింహం..జుట్టు పీక్కున్నాడు. ''ఏమిటోరా ప్రకాశం?! నాకేం అర్థం కావడం లేదు. మరి అనంతరామయ్యగారి సంగతి? పిలుద్దామా?!'' అన్నాడు నరసింహం.

''అప్పుడే వద్దురా సింహం. ఈ మంచినీళ్ళ జగ్గు నీ దగ్గర పెట్టుకో ఈసారి'' అంటూ తన హ్యాండ్ బ్యాగ్‌లో నుండి ఒక టేప్ రికార్డర్ బయటకు తీసి, బల్లమీద ఉంచి..

''ఇక ఇప్పుడు పిలిపించు!'' అన్నాడు ప్రకాశం.

అనంతరామయ్యగారు లోపలికి వచ్చారు. వెంటనే ప్రకాశం..తనని తాను పరిచయం చేసుకుని..''నేను త్వరలోనే ఒక పెద్ద కంపెనీలో సూపర్‌వైజర్‌గా చేరబోతున్నాను. కాస్త మీ ఉద్యోగ అనుభవాలను తెలుసుకుందామని పిలిపించాను'' అన్నాడు.

అనంత రామయ్యగారు గొంతు సవరించుకున్నారు. వెంటనే ప్రకాశం..టేప్‌రికార్డర్ ఆన్ చేసి, జేబులో నుంచి దూది తీసి..చెవుల్లో పెట్టుకున్నాడు.''నేను ఎనిమిది సంవత్సరాల వయసులో ఉండగా జరిగిన సంఘటన ఇది..'' చెప్పటం మొదలు పెట్టారు అనంతరామయ్యగారు. అలా చిన్ననాటి సంఘటనతో మొదలుపెట్టి, స్కూల్ జీవితం దాటి, ఉద్యోగం వేటలోకి రాగానే, ఆయన వాక్ ప్రవాహం నిదానంగా మొదలై పరవళ్ళు తొక్కుతూ, సుళ్ళు తిరుగుతూ, జలపాతంలా దూకుతూ..సాగిపోతూ..మధ్యలో కొద్దిగా ఆగింది.నరసింహం..తన ఎదురుగా ఉన్న జగ్గులోని నీళ్ళని తనకి తెలీకుండానే మొత్తం తాగేసాడు. నరసింహం మెదడంతా మొద్దుబారినట్లుగా అయింది.

ఇదంతా గమనించిన ప్రకాశం చిర్నవ్వుతో..తన చెవుల్లోంచి దూదిని తీసి..ప్రక్కన పెట్టి..రాంబాబుని పిలిచాడు. రాంబాబు రాగానే జగ్గుతో నీళ్ల తెప్పించి గ్లాసుతో అనంతరామయ్యగారికి ఇప్పించాడు..ప్రకాశం.

ఆ నీళ్ల తాగి అనంతరామయ్యగారు..గొంతు సవరించుకొని ''ఇక ఇప్పుడు నా జీవితంలో తిన్న ఎదురు దెబ్బలు గురించి చెబుతా వినండి'' అంటూ మొదలుపెట్టారు.


ఆగివున్న ప్రవాహం మరలా వూపందుకుంది. అనంతంగా అలా సాగిపోతోంది. గోడకు ఆనుకుని నిలబడ్డ రాంబాబు..అలానే కూలబడిపోయాడు. నరసింహం గాల్లోకి చూస్తూ కూర్చుండిపోయాడు. ఇదంతా గమనించిన ప్రకాశం, ఇక లాభం లేదనుకుని..''అంటే మీరు జీవితంలో చాలా ఎదురు దెబ్బలు తిన్నారన్నమాట. మీ నుదుటి మీద అంత పెద్ద గాయపు మచ్చని చూసినప్పుడే అనుకున్నాను. ఎవరు కొట్టారు... అంత దెబ్బ?!'' అన్నాడు.అనంతరామయ్యగారికి ముందు అర్థంకాక, అర్థం అయిన తర్వాత అవమానంతో తలవంచుకొని లేచి నిలబడ్డారు, బయటకు వెళ్ళటానికి.

''ఆగండి అనంతరామయ్యగారూ! అప్పుడే వెళ్లకండి. ఇప్పుడు మీకు ఒక అద్భుతమైన బహుమానం ఇస్తాను. దానిని మీరు తీసుకుని ఇక్కడే ఆస్వాదించాలి'' అంటూ క్యాసెట్‌ని వెనక్కి తిప్పి హెడ్‌ఫోన్స్‌ని అనంతరామయ్యగారి చెవులకు తగిలించి టేప్ రికార్డర్‌ని ఆన్‌చేసాడు ప్రకాశం.

''మధ్యలో మీరు వీటిని తీసేస్తే...మీ నుదుటి మీద మరొక గాయపు మచ్చ పడుతుంది'' అన్నాడు మరల ప్రకాశం నవ్వుతూ.

అయోమయంగా, భయం భయంగా వినటం మొదలుపెట్టారు అనంతరామయ్యగారు.

''నేను ఎనిమిది సంవత్సరాల వయసులో వుండగా-'' అనంతరామయ్యగారి గొంతు, అనంతరామయ్యగారి చెవుల్లోనే ప్రతిధ్వనిస్తోంది.



కొద్దిసేపటికే అనంతరామయ్యగారు అసహనంగా అటూ ఇటూ కదిలారు. ఆయన మెదడును..చపాతీల పిండిలా చేసి, బండకేసి బాదుతున్నట్లుగా ఉంది ఆయన ఫీలింగ్. క్యాసెట్‌లోని..తన మాటల్ని తానే..అసహ్యించుకునేటట్లుగా చేస్తున్నాడు ఈ ప్రకాశం. బాధగా అనుకుంటున్నారు అనంతరామయ్యగారు. తల గుండ్రంగా తిరుగుతున్న అనుభూతి. జగ్గులో మిగిలిన నీళ్ళను గడగడా తాగేసి..కుర్చీలో నుండి దబ్బున క్రిందపడిపోయారు అనంతరామయ్యగారు.

ఇదంతా చూస్తున్న అటెండర్ రాంబాబు మెల్లగా గోడను పట్టుకుని లేచి నిలబడ్డాడు. ఒక స్థిర నిశ్చయానికి వచ్చినా వాడిలా..క్రిందపడ్డ అనంతరామయ్యగారిని, ఖాళీ అయిన మంచినీళ్ల జగ్గును... తన వంక కోపంగా చూస్తున్న ప్రకాశాన్ని..మార్చి, మార్చి చూసాడు. ఒక్క ఉదుటున ముందుకు దూకి..క్రిందపడ్డ అనంతరామయ్యగారి మీద నుండి గెంతి బయటకు పరుగెత్తాడు.

నరసింహం వెర్రిముఖం వేసుకుని చూడసాగాడు. ''కంగారు పడకురా సింహం..మీ రాంబాబు ఎక్కడికీ పోడు. అతను తెచ్చిన మంచినీళ్ల తాగిన కుమార్‌కిగానీ, అనంతరామయ్యగారికిగానీ... ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిసిన రోజున మళ్లీ వస్తాడు.

ఈ లోపుగా ఈ ముసలాయన్ని ఒక ప్రక్కగా పడుకోబెడదాం. ఈయనకు ఇవ్వాలనుకున్న మందు డోస్..కొద్దిగా ఎక్కువైంది అంతే. రెండు రోజుల్లో తేరుకుని మామూలు మనిషి అవుతాడు.

నా అంచనా ప్రకారం- ఇక ముందు ఎవ్వరికీ..ఈయన తన జీవితానుభవాల్ని పొరపాటున కూడా చెప్పడు. సరేనా'' అన్నాడు ప్రకాశం.

నరసింహం రెండు చేతులతోనూ తల పట్టుకుని కూర్చున్నాడు.

''ఒరే సింహం..నిజంగా నువు సింహానివేరా. చాలా గట్టి పిండానివిరా. లేకపోతే, ఇటువంటి సిబ్బంది మధ్య, ఇన్నాళ్లూ తిరుగుతూ కూడా, 'పిచ్చాసుపత్రి' బారిన పడకుండా వుండగలిగావంటే నిజంగా నీ మెదడును ఎగ్జిబిషన్‌లో పెట్టాల్సిందే..'' అన్న ప్రకాశం మాటలకు, తల ఎత్తి భయం భయంగా ప్రకాశం వంక చూసి ''అంతేనంటావా? నిజమేనంటావా?'' అని రెండు మాటలు మాట్లాడి, బల్లమీద ముందుకు పడిపోయాడు నరసింహం.

ప్రకాశం మాత్రం నవ్వుకుంటూ మంచినీళ్ల జగ్గును చేతిలోకి తీసుకున్నాడు... సింహం మొహాన చల్లటానికి.